

అభాగ్యుల భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లు పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న వికలత్వ పింఛను లబ్ధి పొందడానికి లేని రోగం సృష్టించుకుంటున్నారు. గడిచిన నాలుగైదేళ్ల కాలంలో వికలాంగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందులో ప్రధానంగా వినికిడి లోపం ఉన్నట్లు చాలా మంది వైద్యులచేత ధ్రువీకరించుకుని పింఛను పొందుతున్నట్లు తెలుస్తుంది. దీంతో వికలత్వపు పింఛన్ల లబ్ధిదారుల్లో అర్హుల కంటే అనర్హులే ఎక్కువ లబ్ధి పొందుతున్నట్లు స్పష్టమవుతోంది.



పింఛన్ల కోసం.. మాయరోగం



- జిల్లాలో 40వేలకు పైగా వికలత్వ పింఛన్లు
- వీటిలో వినికిడి లోపం పింఛన్లే అత్యధికం
- గత ప్రభుత్వంలో ఎక్కువ సంఖ్యలో మంజూరు
- వికలత్వపు సర్టిఫికెట్లలో వాస్తవికతను తేల్చాలి
- నకిలీలతో ప్రభుత్వానికి ఆర్థిక భారం



కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 15: జిల్లాలో ఇప్పటి వరకు 40160 వికలత్వ పింఛన్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2019 ఫిబ్రవరి నాటికి ఉమ్మడి కడప జిల్లాలో 37,164 మంది వికలత్వ పింఛన్లు పొందుతుండగా, ఇటీవల కాలంలోనే ఈ సంఖ్య జిల్లా విభజన తర్వాత 40వేలకు దాటడం గమనార్హం. వీరపునాయునిపల్లె మండలంలోని పాలగిరి గ్రామంలో తక్కువ జనాభా ఉన్నప్పటికీ 215 మంది వికలాంగులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు అధిక సంఖ్యలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. మండల కేంద్రమైన వల్లూరులో కొన్ని కుటుంబాల్లో ఇద్దరు ముగ్గురు చొప్పున వికలత్వ పింఛన్లు అందుకుంటున్నట్లు సమాచారం. ఇదే కాకుండా జిల్లాలో చాలా చోట్ల వికలత్వ సర్టిఫికెట్లు అక్రమ మార్గంలో పొంది పింఛన్లు అందుకుంటున్నట్లు తెలుస్తోంది.

వికలత్వ పింఛను పొందాలంటే..

సాధారణంగా వికలత్వ పింఛను పొందాలంటే మొదట సదరంలో శ్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో తేదీ, ఏరియా ఆసుపత్రి చూపించడం జరుగుతుంది. ఈ మేరకు ఆయా ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల ద్వారా పరీక్షలు చేయించుకోవాలి. ఈ పరీక్షల్లో వికలత్వపు శాతాన్ని వైద్యులు ధ్రువీకరించి పత్రాలను మంజూరు చేస్తారు. దీని ఆధారంగానే పింఛను మంజూరవుతుంది. ఈ వ్యవహారంలో వేలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రిమ్స్ ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పొరుగు సేవల్లో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులతో పాటు కొంతమంది వలంటీర్ల ద్వారా కూడా గతంలో ఈ వ్యవహా రం చాపకింద నీరులా కొనసాగినట్లు ఆరోపణలు వినిపించాయి. ఇదే అదనుగా చిరుద్యోగులు కూడా తమ కుటుంబ సభ్యులకు ఎలాంటి వికలత్వం లేకపోయినప్పటికీ ధ్రువపత్రాలు పొంది పింఛను పథకం ద్వారా లబ్ధి పొందుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా తమ బంధువులు, తెలిసిన వారికి కూడా వికలత్వ సర్టిఫికెట్లు ఇప్పించి లబ్ధి పొందుతున్నట్లు తెలుస్తోంది.

వైసీపీ హయాంలోనే..


గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇబ్బడి ముబ్బడిగా తమ అనుయాయులకు, వారు సూచించిన వారికి పింఛన్లను మంజూరు చేసినట్లు తెలుస్తుంది. అధికార పార్టీకి చెందిన సిఫారసులతో కూడా వికలత్వ సర్టిఫికెట్ జారీ అయినట్లు చర్చ సాగింది. వృద్ధాప్య పింఛన్లలో కూడా అధికారపార్టీ నాయకుల సూచనల మేరకు ఆధార్‌కార్డులలో వయసు మార్పు చేసి పింఛన్ల లబ్ధి పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలోనే 255 నకిలీ సర్టిఫికెట్లను మూడునెలల కిందట గుర్తించడం జరిగింది. పులివెందుల ప్రాంతంలో వివిధ మండలాలకు చెందిన వారు పులివెందుల ఏరియా ఆసుపత్రికి కాకుండా సత్తెనపల్లె, గుంటూరు, వినుకొండలాంటి ప్రాంతాల నుంచి కూడా సదరం ద్వారా సర్టిఫికెట్ పొందినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా కూడా పెద్దసంఖ్యలో నకిలీ సర్టిఫికెట్లు ఉండవచ్చనేది ఒక అంచనా. జిల్లాలో 40వేలకు పైగా వికలత్వ పింఛన్లు ఉండగా.. ఇందులో ఎక్కువ భాగం వినికిడి లోపంతో ఉన్నట్లు తెలుస్తుంది. అన్నీ బాగున్నప్పటికీ కేవలం చెవుడు అనే కారణం చూపుతూ ప్రభుత్వం ఇచ్చే పింఛన్లను అప్పనంగా దిగమింగుతున్నట్లు స్పష్టమవుతుంది.

నకిలీలతో ప్రభుత్వానికి ఆర్థిక భారం

నకిలీ వైద్యుల ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పడనుంది. ఈ ఏడాది మే నెలలో జిల్లాలోని 40160 మందికి 12 కోట్ల 4 లక్షలా 80 వేల రూపాయలు పింఛను కింద అందజేశారు. అయితే ప్రభుత్వం ఇప్పుడు ఈ పింఛన్లను రెట్టింపు చేయడంతో ఇది మరింత భారం కానుంది. ప్రస్తుతం వికలాంగులకు ఇస్తున్న పింఛను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంపుదల చేశారు. ఈ పెంచి న పింఛన్ల ద్వారా ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడడంతో పాటు ప్రజల సొమ్ము దుర్వినియోగం అయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు. తాజాగా అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం జిల్లాలోనే కాకండా రాష్ట్ర వ్యాప్తంగా వికలత్వపు సర్టిఫికెట్లలో ఎంత వరకు వాస్తవమనేది పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో వినికిడి లోపానికి సంబంధించిన ధ్రువీకరణపత్రాలను ప్రధానంగా పరిశీలించడంతో పాటు ఆధునిక యంత్ర పరికరాల ద్వారా వారి వినికిడి లోపాన్ని గుర్తించినట్లయితే నకిలీ సర్టిఫికెట్ల సంఖ్య తగ్గిపోయే అవకాశాలున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం సర్టిఫికెట్ల జారీకి ఏ విధం గా షెడ్యూలు ఇస్తుందో.. అదే విధంగా సర్టిఫికెట్ల వికలత్వపు పరీక్షలకు షెడ్యూలులో రూపొందిస్తే బాగుంటుందనే ఆలోచన పలువురు వ్యక్తం చేస్తున్నారు.

- ఒక్కోపింఛనుకు రూ.25వేలు వసూలు
- గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన నాయకులు
- ఉంటాయా, పోతాయా..?
- లబ్ధిదారుల్లో గుబులు

కుప్పలు తెప్పలుగా బోగస్ పింఛన్లు


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామ-వార్డు సచివాలయ శాఖ
APESD AB
CERTIFICATE FOR PERSON WITH DISABILITY

కలసపాడు మండలంలో ఓ ప్రజాప్రతినిధి స్వగ్రామంలో బంధువుకు ఇప్పించిన సదరం సర్టిఫికెట్

కలసపాడు, జూన్ 15: అర్హత కలిగిన లబ్ధిదారులకు అందాల్సిన పింఛన్లు బినామీల పరం అయ్యాయి. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చక్రం తిప్పడంతో బోగస్ పింఛనుదారులు కలసపాడు మండలంలో కుప్పలు తెప్పలుగా పెరిగారు. టీడీపీ ప్రభుత్వంలో వికలాంగులకు పింఛను రూ.2వేలు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం దిగిపో యేనాటికి ఇది రూ.3వేలు అయింది. నెలకు రూ.2వేలు పైబడి డబ్బులు వస్తుండడంతో వలంటీర్లు, కొందరు నా యకులు బ్రోకర్లుగా మారి డాక్టర్లతో కుమ్మక్కై మండలంలో ఇబ్బడిముబ్బడిగా వికలాంగుల పింఛన్లు మంజూరు చేయించారు. వికలాంగులను పింఛన్లు ఎంపిక చేసే అర్హత పత్రం ఇచ్చే బాధ్యత వైద్యులదే. కొందరు వైద్యులు ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు కేంద్రంగా సదరం క్యాం పుల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ముడుపులు తీసు కుని బోగస్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. వీటితో పలువురు పింఛన్లు పొందుతున్నారు. ఇదే అదనుగా భావించిన గత ప్రభుత్వంలోని కొందరు నాయకులు ఒక్కో లబ్ధిదారుని నుంచి రూ.25వేలు వసూలు చేసి ప్రకాశం జిల్లాలోని పలు వైద్యకేంద్రాలు, గుంటూరు జిల్లాలోని వినుకొండ, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో సదరంలో స్లాట్ బుక్ చేయించుకున్నారు. చెవిటి, కంటిచూపు మందగించడం, నరాల బలహీనత, పెరాలసిస్ వ్యాధులు కలిగిన వారికి ఇవ్వవలసిన సర్టిఫికెట్లు డబ్బులు తీసుకుని పూర్తిగా ఆరోగ్యంగా ఉన్న వారికి సైతం వైద్యులు మంజూరు చేశారు. దీంతో మండలంలో సుమారు 500 మందికి పైగా బోగస్ పింఛనుదారులు నెలనెలా పింఛన్లు తీసుకుంటున్నారు.

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్డీయే అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యత చేపట్టడంతో పాటు.. గురువారం సాధారణ పింఛను రూ.4వేలకు, వికలాంగుల పింఛను రూ.6వేలకు పెంచారు. గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై టీడీపీ ప్రభుత్వం విచారణ జరిపే అవకాశం ఉండడంతో రూ.25వేలు చెల్లించిన బోగస్ పింఛన్ లబ్ధిదారుల్లో గుబులు రేకెత్తుతోంది. మండలంలో ఎగువ రామాపురం, లింగారెడ్డిపల్లె, పిడుగుపల్లె, మహానందిపల్లె, కలసపాడు తదితర పంచాయతీల్లో బోగస్ పింఛన్లు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఒక్కో ఇంటిలో ఇద్దరు, ముగ్గురు అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు.

వలంటీర్లదే కీలకపాత్ర

గత ప్రభుత్వం 50ఇళ్లకు ఒక వలంటీరును నియమించింది. వలంటీర్లు అడ్డగోలుగా ఒక్కో ఇంట్లో 2, 3 రేషన్‌కార్డులు విడగొట్టి అక్రమాలకు తెర దీశారు. వృద్ధాప్య పింఛన్లలో భార్యను ఒక రేషన్‌కార్డులో, భర్తను ఒక రేషన్‌కార్డులో మార్చి ఇరువురికి పింఛన్లు వచ్చేట్లు చేశారు. వికలాంగుల పింఛన్లు కుటుంబంలో ఎన్ని అయినా ఉండవచ్చనే విష యాన్ని సాకుగా తీసుకుని ఒక్కో ఇంట్లో ఇద్దరు ముగ్గురికి పింఛన్లు వచ్చేటట్లు సహకరించారు. లబ్ధిదారులను వారి సర్టిఫికెట్లను పరిశీలించి అర్హత ఉందో లేదో తనిఖీ చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అడ్డగోలుగా పింఛన్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఈ పింఛన్లు ఉంటా యా, పోతాయా అన్న గుబులు అక్రమంగా పింఛను పొం దుతున్న వారిలో కలుగుతోంది. అంతేకాక కళాకారులకు, డప్పుకళాకారులకు అందించే పింఛన్లలో కూడా మండలంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు పింఛన్లపై మరోసారి విచారణ జరిపి అర్హత కలిగిన వారికే పింఛన్లు వచ్చేలా చేయాలని మండల ప్రజ లు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కోటేశ్వర్‌రావు ను వివరణ కోరగా తాను ఇటీవలే విధుల్లో చేరానని, బోగస్ పింఛన్లపై పరిశీలించి అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

కలసపాడు మండలంలో వికలాంగుల పింఛన్లు పొందేవారంతా చెవిటివారే. కానీ ఎవ్వరూ చెవిటి మిషన్లు వాడరు. కారణం వీరసలు చెవిటి వారే కాదు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వీరు పింఛన్లు పొందుతున్నారు. దీనికంతటికీ కారణం గతంలో ఉన్న అధికార పార్టీ అండతో యథేచ్ఛగా అనర్హులకు ఇవ్వడమే. ముఖ్యంగా మండలంలోని రెడ్డిపల్లె, పెండ్లిమర్రి, కలసపాడు, లింగారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో అధికారులను వత్తిడికి గురిచేసి వీరికి పింఛన్లు వచ్చేలా చేశారు.

అన్నక్యాంటీన్లు తిరిగి ప్రారంభం కాబోతున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ప్రారంభించింది. నామమాత్రపు ధరకే నిరుపేదలకు మూడుపూటలా నాణ్యమైన ఆహారం అందించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నక్యాంటీన్లను మూసివేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. దీంతో కడప కార్పొరేషన్ పరిధిలో అధికారులు దీనిపై కసరత్తు ప్రారంభిస్తున్నట్లు సమాచారం.



జడ్పీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ (ఫైల్‌ఫొటో)

త్వరలో అన్నక్యాంటీన్లు

- రూ.5కే నాణ్యమైన భోజనం
- కడప కార్పొరేషన్ పరిధిలో నాలుగుచోట్ల ఏర్పాటు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 15: పట్టణ ప్రాంతంలోని నిరుపేదలు, భవన నిర్మాణ కార్మికులు తోపుడుబండ్ల వర్తకులు, యాచకులకు మూడుపూటలా నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు టీడీపీ హయాంలో 2018 జూన్ 11న అన్నక్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. అందులో భాగంగా కడప కార్పొరేషన్ పరిధిలో నాలుగుచోట్ల ప్రారంభించారు. అన్నక్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే బాధ్యతను స్థానికంగా ఒక స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. జనాభా 50వేలు పైబడిన పట్టణ ప్రాంతాల్లో అన్నక్యాంటీన్లను ప్రారంభించారు. కడప నగరంలో తొలివిడతగా నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు రూ.36లక్షలు మంజూరు చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి కలిపి మొత్తం రూ.15కు విక్రయించేవారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో అన్నంతో పాటు ఒక కూర, పప్పు, సాంబారు, పెరుగు, పచ్చడి వడ్డించేవారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో అన్నం 400 గ్రాములు, కూర వంద గ్రాములు, సాంబారు 120 గ్రాములు, పెరుగు 75గ్రాములు అందించారు. ఈ క్యాంటీన్లు ఉదయం 7.30 నుంచి 10 వరకు టిఫిన్.. మధ్యాహ్నం 12.30 నుంచి 3 వరకు అలాగే రాత్రి 7.30 నుంచి 9గంటల వరకు పనిచేసేవి.

కడప నగరంలో జడ్పీ ప్రాంగణం, పాత మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండు, కార్పొరేషన్ కార్యాలయం వద్ద తొలుత అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. వీటన్నింటికీ పక్కాభవనాలు కట్టించి అక్కడ భోజనం చేసేవారికి సౌకర్యంగా ఉండేందుకు కుర్చీలు, టేబుళ్ల వంటి సదుపాయాలు కల్పించారు. ఒక్కో క్యాంటీన్‌లో ప్రతిరోజూ సగటున వెయ్యిమందిదాకా అల్పాహారం, 2వేల మందికి పైగా మధ్యాహ్న భోజనం, 1500 మందికి పైగా రాత్రి భోజనం చేసేవారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్నక్యాంటీన్లను మూసివేయించింది. కొన్ని భవనాలను వార్డు సచివాలయాలకు వినియోగిస్తే మరికొన్ని భవనాలను ధ్వంసం చేసి వేరే కార్యాలయాలకు అప్పగించారు. అయితే తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లను తిరిగి అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించే ఫైలుపై సంతకం చేశారు. అన్నక్యాంటీన్ భవనాలు ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నాయనే దానితో పాటు వాటిని శుభ్రం చేసిన తరువాత ఫొటోలను సీఎం క్యాంపు కార్యాలయానికి పంపించాలంటూ కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఆ మేరకు చర్యలు చేపట్టినట్టు సమాచారం.

బంగారం అమ్మకాలలో
జోస్ ఆలుక్కాస్ జోరు

- కడపలో కొత్త షోరూం ప్రారంభం
- సందడి చేసిన సినీ నటి నిధి అగర్వాల్



జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం అనంతరం బంగారు ఆభరణాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, సినీ నటి నిధి అగర్వాల్, షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా పాల్ జె ఆలుక్కా జాన్ ఆలుక్కా

కడప (మారుతీనగర్), జూన్ 15: వినియోగదారుల విశ్వాసాన్ని మరింతగా చూరగొన్న జోస్ ఆలుక్కాస్ అమ్మకాలలో తనదైన శైలిలో మరింతగా జోష్ కనబరుస్తోంది. శనివారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో నూతనంగా సరికొత్త జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, సినీనటి నిధి అగర్వాల్ హాజరై షోరూంను ప్రారంభించారు. అనంతరం వారు షోరూంలో వివిధ డిజైన్‌లలో రూపుదిద్దుకున్న బంగారు ఆభరణాలను తిలకించి డిజైన్లు బాగా ఉన్నాయని కితాబిచ్చారు. అనంతరం షోరూంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాధవీరెడ్డి మాట్లాడుతూ కడప నగరంలో సరికొత్త సొబగులతో జోస్ ఆలుక్కాస్ షోరూం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఇప్పటికే నగరంలో వివిధ బంగారు ఆభరణాల షోరూంలున్నప్పటికీ అధునాతన డిజైన్‌లతో మహిళలను ఇట్టే ఆకర్షించేలా కొంగ్రొత్త రూపులలో జోస్ ఆలుక్కాస్ షోరూం చేరువలోకి రావడం హర్షణీయమన్నారు.

వినియోగదారులకు బంపర్ ఆఫర్ : మేనేజింగ్ డైరెక్టర్లు

జోస్ ఆలుక్కాస్ షోరూంలో ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు 60 వేల రూపాయలు బంగారం కొనుగోలు చేసే వినియాగదారులకు బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నట్లు జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కా తెలిపారు. అదనంగా వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు వెల్లడించారు. బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 50 శాతం వరకూ తగ్గింపు కూడా వర్తిస్తుందన్నారు. ప్రతీ కొనుగోలుపై ఒక ఉచిత బహుమతిని అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. వివాహ వేడుకల కొనుగోలుపై ప్రత్యేక డిస్కౌంట్లు కలవన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వినియోగదారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడి చేసిన నిధి అగర్వాల్

షోరూం ప్రారంభోత్సవానికి హాజరైన సినీనటి నిధి అగర్వాల్ కడపలో సందడి చేశారు. ఆమెను చూడడానికి యువకులు అధిక సంఖ్యలో షోరూం వద్దకు చేరుకున్నారు. దీంతో కొంత ట్రాఫిక్ సమస్య తలెత్తగా పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించారు. యువత జోష్‌తో నిధి అగర్వాల్‌ను డ్యాన్స్ చేయాలని కోరగా ఇస్మార్ట్ శంకర్‌లోని సిలక...సిలక సిలక..ఇది సిత్రాంగి సిలక అనే పాటకు డ్యాన్స్ చేసి అభిమానులను ఉత్సాహపరిచారు.

జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా
శారద బాధ్యతలు

- చైర్‌పర్సన్‌గా ఎస్సీ మహిళ రావడం ఉన్నతంగా ఉంది
- రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి.. జిల్లా అభివృద్ధికి పాటుపడతా



బాధ్యతలు చేపడుతున్న శారద

కడప(రూరల్) జూన్ 15 : జిల్లా పరిషత్తు ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా జెష్ఠాది శారదను నియమిస్తూ జిల్లా కలెక్టర్ విజయరామరాజు జడ్పీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో చైర్మన్ చాంబర్‌లో సీఈవో సుధాకర్ సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు. ఆ వెంటనే ప్రమోషన్లు, సెక్యూరిటీ గార్డ్స్ జీతాలు తదితర ఫైళ్లపై సంతకాలు చేశారు. ఈమె జడ్పీ వైస్ చైర్మన్‌గా కూడా ఉన్నారు. జడ్పీ ఇన్‌చార్జ్ చైర్మన్ నియామక ఉత్తర్వులను ప్రభుత్వానికి పంపారు. ఇదివరకు ఉన్న జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో రాజంపేట ఎమ్మె ల్యేగా గెలుపొందడంతో ఆయన జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేసి కలెక్టర్‌కు అందజేశారు. ఈ పరిణామంతో అమర్‌నాథరెడ్డి స్థానంలో కొత్త చైర్మన్ నియామకానికి ఎన్నికను నిర్వహించాల్సి ఉంది. అప్పటి వరకు ఇన్‌చార్జ్ చైర్మన్‌ను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ తగు చర్యలను చేపట్టారు. ఇన్‌చార్జ్ చైర్మన్ నియామకానికి తగు జడ్పీటీసీల జాబితాను పంపాలని జడ్పీ శాఖను ఆదేశించారు. ఈ మేరకు జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి జడ్పీ వైస్‌చైర్మన్-1(ప్రొద్దుటూరు జడ్పీటీసీ) జె.శారద, జడ్పీ వైస్ చైర్మన్-2 (పెండ్లిమర్రి జడ్పీటీసీ) పిట్టు బాలయ్యల పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసి కలెక్టర్ పేషీకి పంపారు. ఈ మేరకు కలెక్టర్ జడ్పీ నుంచి వచ్చిన జాబితాలోని పేర్లను పరిశీలించి జెష్ఠాది శారదను ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె శనివారం బాధ్యతలను చేపట్టారు.

రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తా..

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి.. పదవిలో ఉన్నంత కాలం అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడతానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ జెష్ఠాది శారద పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం చైర్మన్ చాంబర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎస్సీ మహిళగా మొట్టమొదటిసారిగా జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ వర్గానికి తగు ప్రాధాన్యత కల్పించడంతోనే ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ స్థానంలో కూర్చోగలిగానన్నారు.

ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి కృషి

- నెలకు 20 రోజులు జిల్లాలోనే
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి






మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి - విజయదుర్గాదేవి ఆలయంలో రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దుర్గాప్రసాద్ దంపతులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 15: ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నెలలో 20రోజుల పాటు జిల్లాలో ఉంటూ ప్రజల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సొంత నియోజకవర్గం రాయచోటి వెళుతూ శనివారం మార్గమధ్యంలో కడప విజయదుర్గా ఆలయాన్ని సందర్శించారు. తొలిసారిగా మంత్రి పదవి చేపట్టిన ఆయనకు ఆలయ నిర్వాహకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెలకట్టలేని ఎంతో అభిమానంతో రాయచోటి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనపై నమ్మకం, విశ్వాసంతో మంత్రి పదవిని కట్టబెట్టారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని ప్రజల అభిమానం, విశ్వాసాన్ని రెట్టింపు చేసేలా మంత్రిగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో కడప జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సీఎం చంద్రబాబుతో చర్చించి ఈ ఐదేళ్లలో అవసరమైన నిధులు, సంక్షేమ పథకాలు తీసుకువచ్చి.. జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తామని తెలిపారు. కడపకు విచ్చేసిన మంత్రికి ప్రజలు విశేష సంఖ్యలో రోడ్డుకిరువైపులా బారులు తీరి పూలు, బాణసంచాలతో ఘన స్వాగతం పలికారు.

వామ్మో.. పులివెందుల స్టేషనా!

- అర్బన్ సీఐ, ఎస్ఐ పోస్టులు ఖాళీ
- పోస్టింగ్‌కు ముందుకు రాని వైనం
- ప్రతిపక్షనాయకుడి ఊరు కావడమే కారణం



పులివెందుల టౌన్, జూన్ 15: పులివెందుల అర్బన్ స్టేషన్‌లో రెగ్యులర్ సీఐ, ఎస్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతిపక్షనాయకుడి సొంతూరిలో ఉన్న అర్బన్‌స్టేషన్‌లో ట్రాఫిక్ సీఐ (ఇన్‌చార్జి)తో నడుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో రెండు ఎస్ఐ, ఒక సీఐ పోస్టులు ఉండగా.. ఎన్నికల ముందు ఒక పోస్టింగ్‌లో అరుణ్‌కుమార్‌రెడ్డి, సీఐగా శంకర్‌రెడ్డిలు ఉన్నారు. కౌంటింగ్‌కు ముందు రోజు జరిగిన సంఘటనలో టీడీపీ నాయకుల ఫిర్యాదు తో అరుణ్‌కుమార్‌రెడ్డి వీఆర్‌కి వెళ్లగా.. సీఐ శంకర్‌రెడ్డి అనంతపురం జిల్లాకి బదిలీపై వెళ్లారు. అయితే ఈ పోస్టింగ్‌లలో ఇంకా ఎవరిని నియమించకపోవడంతో పోస్టింగులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు రద్దీగా ఉండే స్టేషన్ అధికారుల కొరతతో బోసిపోయినట్లు ఉంది. ఎస్పీ డీఓలు ఇస్తున్నా ఎవరు రావడానికి ముందుకు రాలేదు అన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఏ అధికారికైనా మంచి పోలీస్ స్టేషన్‌లో పోస్టింగు రావాలని కోరుకుంటారు. జిల్లాలో పులివెందుల పోలీస్‌స్టేషన్ ప్రధానమైనది. పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ పోస్టులకు డీఓలు ఇస్తామంటే.. వా మ్మో పులివెందుల పోలీస్‌స్టేషనా.. మేం చేయలేం.. వేరేచోటకి వేయండి అని ఎస్పీకి మొరపెట్టుకున్నట్లు ఆ శాఖలో గుసగుసలువినిపిస్తున్నాయి. ఎందుకంటే పులివెందుల అర్బన్‌లో పనిచేయాలంటే అధికారపక్షంలోని టీడీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోవాలి. అలాగే ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో విపక్షాన్ని నొప్పించకుండా విధులు నిర్వర్తించాలి. దీంతో ఇక్కడ పనిచేయడం అంటే కత్తిమీద సాములా ఉంటుందని అధికారులు వణికిపో తున్నట్లు తెలుస్తోంది. దీంతో పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో పనిచేయడానికి పోలీసు అధికారులు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదనడంలో ఎలాంటి సందేహం లేదు.



సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చందుకిషోర్ (ఫైల్ ఫొటో)

అతివేగం... ఆవేశం.... ప్రాణాపాయం

వేగం ఎక్కువ... వయస్సు తక్కువ... ● ప్రాణాలు కోల్పోతున్న మైనర్లు

అవగాహన లేక నెత్తురోడుతున్న రోడ్లు ● కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు

చిట్వేలి, జూన్ 15: అతివేగం, ఆవేశం రెండూ ప్రమాదకరాలని పెద్దలు చెబుతూనే ఉంటారు. రెండింటిలో ఏది ఎక్కువైనా మూల్యం చెల్లించుకోక తప్పదని కాలం చెబుతూనే ఉంది. ద్విచక్ర వాహనాలు నడిపేందుకు నేటి కుర్రకారు ఆసక్తి కనబరుస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వాహనాన్ని వేగంగా నడుపుతూ అడ్డూ అదుపులేకుండా దూసుకెళుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ నైపుణ్యం స్నేహితులకు చూపించాలనే తాపత్రయం సరదా షికారు మోజులో ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ తల్లిదండ్రులకు గర్భకోశం మిగిలిస్తున్నారు.

అతివేగంతో పోతున్న ప్రాణాలు

చేతిలో వాహనం ఉంటే హద్దులు మరచిపోతున్నారు. ఇంట్లో వారికి తెలియకుండా బైకులు బయటకు తీసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ రయ్‌రయ్ మంటూ రోడ్లపైకి వస్తున్నారు. ఈ క్రమంలో వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టేస్తున్నారు. హీరోలా చేతులు వదిలి డ్రైవింగ్ చేస్తూ పట్టుతప్పి పడిపోతున్నారు. ఒక వాహనం మీద ముగ్గురు లేక నలుగురు కూర్చుని గాలిలో తేలిపోతున్నట్లు అతివేగంగా అడ్డదిడ్డంగా నడుపుతూ పాదచారులకు, వాహనదారులకు ఎదురుగా వస్తున్న వారిని గాయపరుస్తున్నారు.



మే 27న అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాలుడు (ఫైల్‌ఫొటో)

చెడు అలవాట్లకు బానిస అవుతూ

దేశానికి కుటుంబానికి వెన్నుదన్నులా ఉండాల్సిన నేటి యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారు. ఎంజాయ్ పేర్లతో పార్టీలు చేసుకుంటూ చెడు మార్గంలో పయనిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులతో చిట్వేలిలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎటునుంచి ఏ వాహనం వస్తుందో ఎక్కడ గుద్దేసి వెళ్లిపోతుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

18 ఏళ్ల లోపు పిల్లలు మోటారు వాహనాలను నియంత్రించే సామర్థ్యాలు ఉండవు, మోటారు వెహికల్ చట్టాలు, నిబంధనపై అవగాహన ఉండదు. ద్విచక్ర వాహన అనుమతులు పొందేందుకు అర్హులు కారు. విషయాలన్నీ పిల్లలకు తెలియజేసేందుకు రోడ్డు భద్రత వారోత్సవాలతో పాటు సాధారణ రోజుల్లోనూ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, రవాణా, పోలీసు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. పూర్తిస్థాయిలో అవగాహన చర్యలు లేకపోవడంతో రోడ్లు నెత్తురోడుతున్నాయి. చిట్వేలి మండలంలో మే 23 గరుగుపల్లె రోడ్డులో మైలపల్లె అరుంధతి వాడ బాలుబు అతివేగంగా వస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి చనిపోయారు. మే 27న అంబేడ్కర్ సర్కిల్ వద్ద కోడూరు మండలం అనంతరాజుపేటకు చెందిన ఒకరు, పెనగలూరు మండలం కట్టావారిపల్లెకు చెందిన వ్యక్తి ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించకూడదు

మైనర్లకు బైకులు ఇవ్వకూడదని, ఇచ్చినవారు శిక్షార్హులు అవుతారని అధికారులు చెబుతున్నా పిల్లల తల్లిదండ్రులకు పట్టడంలేదు. శిక్షణ లేని వ్యక్తి చేతిలో ఉన్న వాహనం మారణాయుధం లాంటిది. అది నడిపితే వారితో పాటు ఇతరుల ప్రాణాలకు హాని కలిగిస్తుందని, వాస్తవాలను తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన పెంచాలి. 2022 నుంచి 2024 వరకు 14 మంది చనిపోగా 20 మందికి గాయాలయ్యాయి.

మైనర్లకు వాహనాలను ఇవ్వరాదు



డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే ఎవరికీ వాహనాలను ఇవ్వరాదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వకూడదు. వారు ఓవర్ స్పీడు వెళ్లడం, రేసింగ్ చేస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. రోడ్లపై రాంగ్ డ్రైవింగ్, హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడపడం, త్రిపుల్ రైడింగ్ వంటివి చట్టరీత్యా నేరము. తల్లిదండ్రులు జీవనోపాధికి గల్ఫ్‌దేశాలకు వెళ్లి ఇంటివద్ద పిల్లల బాధ్యతను అవ్వాతాతలకు అప్పగిస్తుండడంతో పిల్లలు ఎవరికీ తెలియకుండా వాహనాలను ఎలా పడితే అలా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతూ నూరేళ్ల జీవితాన్ని అంధకారంలో నెట్టుకొంటున్నారు. రోడ్డు భద్రతలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాము. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహిస్తూ విలువలు నేర్పిస్తూ మంచి నడవడికతో పిల్లలను పెంచాలి.

ఎస్ఐ సుధాకర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రసాద్ మృతదేహం

కమలాపురం రూరల్, జూన్ 15: కడప - తాడిపత్రి జాతీయ రహదారిపై చదిపిరాళ్ల వద్ద స్కూటరులో వెళుతున్న ఒకరు మరొక రిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కడప ఒంటిగారిపల్లెకు చెందిన ప్రసాద్ కడప మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి స్కూటరుపై ఎర్రగుంట్ల నుంచి కడప వైపు వెళుతుండగా సరిగా కనిపించకపోవడంతో రోడ్డుపై వెళుతున్న మరొకరిని ఢీకొట్టినట్లు స్థానికులు తెలుపుతున్నారు. దీంతో స్కూటరుపై వెళుతున్న ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. గాయపడిన మరొకరిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని శవం లభ్యం

సికెదిన్నె, జూన్ 15: దాదాపు 35 నుంచి 45 ఏళ్లున్న గుర్తు తెలియని శవాన్ని కనుగొన్నట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. మామిళ్లపల్లె సమీప సోమయాజులపల్లెకు ఉత్తరం వైపు కంపచెట్లలో శవాన్ని గుర్తించారన్నారు. శవంపై కాఫీరంగు లుంగీపై సబ్బురంగు కలర్ డిజైన్ ఉందని, బ్లూరంగు ఫుల్‌డ్రాయర్, మెరూన్ రెడ్ ఫుల్‌షర్టు ధరించి దాదాపు 5.6 అడుగుల ఎత్తు ఉండవచ్చన్నారు. ఆచూకీ తెలిస్తే సికెదిన్నె పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంకా జగన్‌కు జ్ఞానోదయం కాలేదు

వైసీపీ రాజ్యాంగ విరుద్ధమైన పార్టీ ● తప్పులు సరిదిద్దుకోకపోతే...

● చంద్రబాబు దూరదృష్టితోనే 'ల్యాండ్ టైటిలింగ్' రద్దు

● భారత న్యాయవాదుల సంఘం



కేక్‌ను కట్ చేస్తున్న భారత న్యాయవాదుల సంఘం నేతలు

కడప(రూరల్) జూన్ 15: ప్రజలు భారీగా తిరస్కరించినా ఇంకా జగన్‌కు జ్ఞానోదయం కాలేదని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి. సుబ్రమణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ ఘాటు విమర్శలు చేశారు. కడప బార్ అసోసియేషన్ హాలులో శనివారం సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ రాజ్యాంగ విరుద్ధమైన పార్టీ అని ఈ కారణంగానే రాష్ట్ర ప్రజలు ప్రతిపక్షహోదా కూడా కల్పించలేదని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భయానక టైటిలింగ్ యాక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దుచేయడం పట్ల ఆయనకు అభినందనలు తెలిపారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రాజ్యాంగ విరుద్ధమైందని, జగన్‌కు రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం ఉన్నా ప్రజల ఆస్తులు, హక్కులకు తీవ్ర నష్టాన్ని కలగజేసే టైటిలింగ్ యాక్టు గురించి నోరు మెదపకపోవడం మంచిదన్నారు. గత ఎన్నికల్లో 151 సీట్ల ఇచ్చిన ప్రజలు జగన్ తప్పులు చేయడంతో సాధారణ ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌కు జ్ఞానోదయం కలగడం లేదన్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయానికి భిన్నంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు మంచిదని దానితో మంచి జరుగుతుందని నేతిబీరకాయ మాటలు మానుకోకపోతే వచ్చిన 11 సీట్లు కూడా ఉండవని హెచ్చరించారు. కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, న్యాయవాదుల సంఘం గౌరవ సలహాదారులు నాగ సుబ్బారెడ్డి, కడప నగర అధ్యక్షుడు రామకొండయ్య, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అన్నీ అవకతవకలే

● వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడమే

● అధికారులు చర్యలు తీసుకోవాలి

ఖాజీపేట, జూన్ 15: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, ఎంపీటీసీ చంద్రబాస్కర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట పంచాయతీలోనే 1148 మంది లబ్ధిదారులకు జాబ్‌కార్డులు ఉన్నాయని, కొందరు వైసీపీ నేతల అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్లు దోచుకుంటున్నారని వివరించారు. ఖాజీపేట వైసీపీ నేతల చెంచాల పేర్లు పెట్టుకుని ఏడాదిలోనే లక్షలు సంపాదించారని విమర్శించారు. మహబూబ్‌బాష (పంప)ఆయన భార్య మహబూబ్‌చాన్, ఫీల్డ్ అసిస్టెంట్ భార్య సుగుణ ఉద్యోగస్తురాలు. కుమారుడు హేమంత్ 6వ తరగతి, కూతురు సాయి 10వ తరగతి అయిపోయింది. ఒకే కుటుంబంలో మూడు జాబ్‌కార్డులు ఉన్నాయి. ఖాజీపేట పంచాయతీలో 100 కార్డులు సంబంధించిన సాక్ష్యాలు ఉన్నాయని, ఒక్క ఏడాదిలో రూ.25 లక్షలు అవకతవకలు జరిగాయంటే ఐదేళ్లలో కోట్లలో అవినీతి జరిగి ఉంటుందని, మండల పరిధిలో కూడా ఎంత జరిగిందో అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. అంతేకాక ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు ఎందుకు రాజీనామా చేశాడో, ఎందుకు విధుల్లోకి హాజరయ్యాడో అధికారులు చెప్పాలని, ఇలాంటివారిపై అధికారులు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు టీడీపీ వెంటే : వెంకటరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): ఊపిరి ఉన్నంత వరకూ మా కుటుంబం టీడీపీ వెంటే ఉంటామని కాశినాయన మండల టీడీపీ నేత వెంకటరెడ్డి ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. జిల్లాలో క్లిష్టపరిస్థితుల్లో టీడీపీ వెంటే ఉన్నాం. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులపై జగన్ ఉక్కుపాదం మోపారు. మేం పార్టీ కోసం జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ ఆదేశాల మేరకు నేను, నా భార్య క్లిష్ట సమయంలో జిల్లా వ్యాప్తంగా తిరిగాం. మహిళా అధ్యక్షురాలి హోదాలో నా భార్య బాధితులకు భరోసాగా నిలిచింది. మమ్మల్ని టీడీపీ నుంచి వేరు చేసేందుకు దుష్ప్రచారం చేస్తూ మేమేదో పార్టీ మారినట్లు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేం పార్టీ మారలేదంటూ ఆయన వివరించారు. కాశినాయన మండలం శివారెడ్డి కుటుంబానికి అడ్డా. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీపై కేసులు పెట్టారు. అయినా సరే మాకు ఎలాంటి సహకారం లేకపోయినా కూడా మేం పోరాడాం. నిన్న జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం చేశాం. అయితే మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి కనీసం మాకు ఎలాంటి బూత్‌లు కానీ ఎలాంటి బాధ్యతలూ అప్పజెప్పలేదు. మేం టీడీపీ సైనికుల్లా మా ఓటు మేం వేసుకుని మా వెంట ఉన్నాం. అయితే మేం పార్టీ మారినట్లు ప్రచారం చేస్తున్నారు. విజయమ్మ సొంతూరులోనే ఎంపీ అవినాష్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చాయి. మేం నిజాయితీగా టీడీపీకి ఓటు వేశాం. మా మీద విష ప్రచారం మానుకోండి.

'సీమ'లో హైకోర్టు బెంచినైనా ఏర్పాటుచేయాలి

వేంపల్లె, జూన్ 15: రాయలసీమలో హైకోర్టును, లేదా హైకోర్టు బెంచిని గానీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టు ఈ రెండింటిలో ఒకదానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు రాయలసీమలో రాజధానిని, కోస్తాలో హైకోర్టును ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. 1956లో తెలంగాణతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు రాజధాని, హైకోర్టు రెండు కూడా హైదరాబాద్‌కు తరలించబడ్డాయన్నారు. 2014లో విభజన కారణంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటైందన్నారు. ఈ నేపథ్యంలో నవ్యాంధ్రప్రదేశ్‌లో రాజధాని, హైకోర్టుల్లో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాల్సిఉన్నా జరగలేదన్నారు. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అలహాబాద్‌లో హైకోర్టు, రాజధాని లక్నోలో హైకోర్టు బెంచ్ ఉన్నాయన్నారు. కేరళ,గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా, అస్సాం, అరుణాచలప్రదేశ్, నాగాల్యాండ్, మిజోరాం రాష్ట్రాల్లో హైకోర్టులు రాజధాని వెలుపల ఉన్నాయన్నారు. కావున రాయలసీమలో హైకోర్టును గానీ, హైకోర్టు బెంచిని గానీ ఏర్పాటుచేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆగని ఇసుక మాఫియా ఆగడాలు

ఏరియాలు పంచుకుని సాగిస్తున్న దందా ● దాడులకు తెగబడుతున్న వైనం

పట్టించుకోని పోలీసు, సెబ్, రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు జూన్ 15: ప్రొద్దుటూరులో వైసీపీ ఇసుక మాఫియా ఆగడాలు ఆగడం లేదు. 'ఎవరు మారితే మాకేంటి ప్రభుత్వం మారినా మాదే హవా' అనే తీరులో ఇసుక దందా సాగుతోంది. 'పోలీసులకు ఇతర అధికారులకు మామూళ్ళు ఇస్తున్నాం మా దందా మేమే సాగిస్తాము ఎవరు వస్తారో రాండి చూసుకుందాం' అంటూ చాలెంజ్ విసురుతున్నారు. ఇసుక మాఫియా ఏరియాలు పంచుకుని పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా యధేచ్ఛగా సాగిస్తున్నారు. ముఖ్యంగా రామేశ్వరం నుంచి ఆర్‌టీపీపీ రోడ్డులో పెన్నానదిలోకి వైసీపీకి చెందిన ఇసుక మాఫియా వారు మరో ప్రాంతం వారిని రానీయడం లేదు. కేవలం తాము మాత్రమే ఇక్కడ ఇసుక తవ్వకాలు చేసుకుంటామని ఎవరు వచ్చినా భయపడేది లేదని తెగేసి చెబుతున్నారు. శనివారం ఉదయం ఆర్‌టీపీపీ వెళ్లే రోడ్డులో పెన్నానదిలోకి బయటి ప్రాంతాల వాళ్ళ ఇసుక ట్రాక్టర్లను రామేశ్వరం వైసీపీకి చెందిన ఇసుక మాఫియాకు చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కొందరు వన్‌టౌన్ బ్లూకోల్ట్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు చేరుకుని ఘర్షణ జరకుండా చెదరగొట్టారని సమాచారం. కానీ వారిని అదుపులోకి తీసుకోకుండా కేవలం అక్కడి నుంచి పంపించి వేశారని సమాచారం.



గుంతలు తీస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఏరియాలు పంచుకుని సాగిస్తున్న దందా

వైసీపీ ప్రభుత్వం మారి రోజులు గడుస్తున్నా ఇంకా వైసీపీకి చెందిన ఇసుక మాఫియా పెన్నానదిలో కొన్ని ఏరియాలను తమ అధీనంలో పెట్టుకుని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతోంది. ముఖ్యంగా రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్, ఆర్‌టీపీపీ రోడ్డులో రామాపురం ఏరియాల్లో సాగిస్తున్నారు. ఈ ఏరియాల్లో వైసీపీ ముఖ్య నేత అనుచరులైన మార్తల నవీన్‌రెడ్డి మార్తల చంద్రారెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు ఆ ప్రాంతంలో చెలరేగిపోతున్నారు. ఇటీవల మార్తల నవీన్‌రెడ్డి కోసమే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి వన్‌టౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి సీఐని బెదిరించి ఆయనను విడిపించుకుని తీసుకోచ్చారు.

ముక్తియార్ ఆయిల్ మిల్లు ఎర్రగుంట్ల రోడ్డు అండమాన్ ప్రాంతంలో మరికొన్ని బ్యాచ్‌లు తవ్వకాలు చేస్తున్నారు. చౌడూరు పెద్ద శెట్టిపల్లె కొత్తపేట చౌటపల్లె రామేశ్వరం నంగనూరు పల్లె రేగుల పల్లె కల్లూరు ప్రాంతాల్లో ఇంకా ఇసుక అక్రమ రవాణాను సాగిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం సెబ్ అధికారులు పోలీసులకు స్టేషన్ మామూళ్లు బ్లూకోల్ట్ బ్యాచ్‌లకు మామూళ్ల ఇవ్వడం వలన ఈ దందా యధేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు తమ తీరు మార్చుకుని ఇసుక మాఫియాను నియంత్రిస్తారా లేక ఇంకా పాతపంథాలోనే కొనసాగుతారా చూడాలి.

మార్గాలను మూస్తున్న రెవెన్యూ సిబ్బంది

తహసీల్దారు విద్యాసాగర్ ఆదేశాలతో వీఆర్‌ఓలు చెన్నా రవి ప్రకాష్, అమర్‌నాద్‌రెడ్డి ఎక్స్‌కవేటర్‌తో పెన్నానదిలోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా మార్గాలను మూసేందుకు శనివారం రాత్రి భారీగా గోతులు తీస్తున్నారు. ముక్తియార్ ఆయిల్ మిల్లు, ఆర్‌టీపీపీ రోడ్డులో రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ ఏరియాలో గోతులు తీస్తున్నారు. అయితే ఇసుక మాఫియా అక్కడి వచ్చి రెవెన్యూ సిబ్బందిని బెదిరించింది. తీస్తే అన్ని ప్రాంతాలు తీయాలా లేకుంటే గుంతలు పూడ్చుతామని హెచ్చరించారని వీఆర్‌ఓ రవి ప్రకాష్ తెలిపారు. ఒకవైపు గోతులు తీస్తుంటే మరోవైపు టాక్టర్లలతో వ్యర్థాలను తెచ్చి ఇసుక మాఫియా గోతులు పూడ్చుతున్నదని వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న పోలీసులు

ఇసుక మాఫియా ఘర్షణలకు దిగుతూ ఏరియాలు పంచుకుని దందా సాగిస్తుంటే పోలీసులు, సెబ్ అధికారులు మాత్రం ఇది తమ పనికాదనట్లు చోద్యం చూస్తున్నారు. ఇందులో జోక్యం చేసుకుంటే ఎక్కడ తమ మామూళ్ల సంగతి బయట పడుతుందోనని కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక రవాణను అరికడతాం : డీఎస్పీ

ఇసుక అక్రమ రవాణా సాగుతుండడం మా దృష్టికి వచ్చింది. కానీ ఏరియాలు పంచుకుని దందాలు సాగిస్తూ ఘర్షణలకు దిగడంపై వీడియోలు మా దృష్టికి వచ్చాయి. రేపటి నుంచి ఆ ఏరియాల్లో పికెట్ ఏర్పాటు చేయిస్తాం. ఈ మేరకు సీఐలకు ఆదేశాలిస్తాను. ఎవరూ పెన్నానదిలో నుంచి ఇసుక అక్రమ రవాణా సాగించినా ఉపేక్షించమన్నారు. కేసులు పెట్టి ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు.



దౌర్జన్యం చేస్తున్న ఇసుక మాఫియా

సౌమ్యనాథుడి సన్నిధిలో రాష్ట్ర ఆడిట్ అధికారులు

నందలూరు, జూన్ 15: చారిత్రాత్మక సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం రాష్ట్ర ఆడిట్ ఏజీ అధికారులు సుమేద్‌బోధి, మహేశ్వరరాజు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరితో పాటు జిల్లా పరిషత్ అధికారులు దేవదర్శన్‌రెడ్డి, వరుణ్, ఎంపీడీఓ ప్రకాష్, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

కురబలకోటలో చోరీ

కురబలకోట, జూన్ 15: కురబలకోటలో శని వారం చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... ఆర్యవైశ్య బజారుకు చెందిన వెంకటనారాయణ రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దొంగలు ఇంటి వెనుకవైపు నుంచి ఇంట్లోకి జొరబడి ఇంట్లో బీరువా తాళాలను పగలకొట్టి అందులోని 42 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లారు. కాగా శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగానే చోరీకి గురైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రప్పించి తనిఖీలను నిర్వహించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

కమలాపురం రూరల్, జూన్ 15: కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి పుట్టినరోజు సందర్భంగా నేటి నుంచి జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పీఈటీ లు శివశంకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, సునీల్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించిన వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహించబోయే కబడ్డీ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకున్న క్రీడాకారులు నమోదు చేసుకున్న క్రీడా టీములు కూడా ఆదివారం ఉదయం 7గంటలకు కమలాపురం టీడీపీ కార్యాలయానికి చేరు కోవాలని వారు తెలిపారు. వివరాలకు 9110353548, 6304228090 సంప్రదించాలని వారు తెలిపారు.

18న వాహనాల వేలం

ములకలచెరువు, జూన్ 15: తంబళ్లపల్లె, పెద్దమం డ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలా ల్లో ఎస్ఈబీ అధికారులు 18న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ రామ్మోహన్ తెలిపారు. అక్రమ మ ద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెబ్ కార్యాల యంలో ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ సమక్షంలో జరిగే వాహనాల వేలంలో ఆసక్తి గల వారు రూ.3వే లు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టాలి

● పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 15 : జిల్లాలో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న వాటిని నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు ఆరోపించారు. ఫీజుల వివరాలు నోటీసు బోర్డుల్లో వెల్లడించాలని డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం పీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారంతా తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిపై విద్యాశాఖ ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 15 :ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం మొదట్లోనే పుస్తకాలు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హరిబాబు, శ్యామ్ పాల్గొన్నారు.

ఆంధ్ర అయోధ్యలో రామకోటి

చక్రాయపేట, జూన్ 15: మండలంలోని దేవరగుట్టపల్లె-నాగులగుట్టపల్లె మధ్యలో త్రేతాయుగంలో వెలసిన భగవంతుడైన శ్రీరామచంద్రుని తల్లిదండ్రులు కౌసల్య, సుమిత్ర, కైకేయీ సమేత శ్రీ దశరథ మహారాజుస్వామి దేవస్థానంలో రామకోటి కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేశంలో శ్రీరామచంద్రుని తల్లిదండ్రుల దేవస్థానం ఎక్కడ లేదని తెలిసి భద్రాచల భక్త రామదాసు వంశస్థులు ఇక్కడరామకటి మహాయజ్ఞం జరగాలని భక్తులతో రామకోటి రాయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్వామివారి అన్నప్రసాదం దాత నాగులగుట్టపల్లె ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్‌నర్స్ దేవకి దేవి నాగరాజు ఆలయ ధర్మకర్తరామసుబ్బయ్య, మాజీ సర్పంచుసుబ్బరామయ్యమరియు భక్తులందరుపాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను దశరథ మహారాజు స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు.

బురద చల్లడం మాని అభివృద్ధికి సహకరించాలి

● నియోజకవర్గ అభివృద్ధికి కృషి ● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 15 : వైసీపీ నాయకులు బురద చల్లడం మానుకుని అభివృద్ధికి సహకరించాలని, కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పా టు చేశారు. అక్కడికి అధికారులు, టీడీపీ నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తొలి సంతకం మెగా డీఎస్సీపై చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు వచ్చే విధంగా చేశారన్నారు. రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై చేసి రైతాంగానికి ధైర్యాన్ని ఇచ్చారన్నారు. అవ్వతాతలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా రూ.4వేలు ఇంటి వద్దకే వెళ్లి అందిస్తారన్నారు. అదేవిధంగా పేదలకు రూ.5లకే కడుపునింపే అన్న క్యాంటిన్ ఏర్పాటుపై మరో సంతకం చేశారన్నారు. అలాగే యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం మరో సంత కం చేశారన్నారు. వైసీపీ నాయకులు టీడీపీపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. బురద చల్లడం మానుకుని కమలాపురం అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇక నుంచి అందరికీ అందుబాటులో ఉంటానని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కమలాపురం కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన వద్దకు వచ్చి చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, పల్లె రా మ సుబ్బారెడ్డి, బోయిన శంకర్‌రెడ్డి, బీసీ నాయకుడు గోపాల్ ,వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌యాదవ్, నబీర సూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోండి: ఎమ్మెల్యే

సీకేదిన్నె, జూన్ 15 :విద్య ద్వారా ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్టూడెంట్ కిట్ పంపిణీలో భాగంగా విద్యార్థులకు బ్యాగు, బుక్కులు పంపిణీ చేశారు. కమలాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించి మొట్టమొదటి సారిగా చింతకొమ్మదిన్నె మండలం విచ్చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి పార్టీ నాయకులు, మండల ఇన్‌చార్జి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా, పూలవర్షం కురిపించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. టీడీపీ డాక్టర్ల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుని పాఠశాల అభివృద్ధికి సహకరించాలని, అదే విధంగా విద్యార్థులకు ఆటస్థలం ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయప్పరాజు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, డీవీ సుబ్బారెడ్డి, వీరకుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగన్, బ్రహ్మానందరెడ్డి, బాబు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

'బాలబాలికలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు'



ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న కార్మిక శాఖ జిల్లా ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్, సిబ్బంది

కడప (నాగరాజుపేట), జూన్ 15:జిల్లాలో బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని కడప జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా శనివారం నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, వ్యాపారసంస్థలు రెస్టారెంట్లు, చికెన్ షాపులు, మెకానిక్ షాపులు, లేదా ఇళ్లల్లో పిల్లలతో పనిచేయిస్తుంటే స్పెషల్ ఆపరేషన్ ద్వారా వారిని గుర్తించి బాధ్యులైన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందుకు తరచుగా ఆపరేషన్ ముష్కాన్ ఆపరేషన్ స్మైల్‌తో పాటు లేబర్ ఆఫీసరు ద్వారా కూడా జిల్లాలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. వ్యాపార సంస్థ యజమానులకు బాలకార్మికులకు తల్లిదండ్రులులకు అవగాహన కల్పించి ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పించి చదివించాలన్నారు. వారితో వెట్టిచాకిరీ చేయించి జీవితాలను నాశనం చేయవద్దన్నారు.

'భావన టౌన్‌షిప్ అక్రమాలపై విచారణ జరిపించాలి'



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 15 : కడప నగర పరిధిలోని భావన టౌన్‌షిప్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.కడప నగరంలోని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ర్పాటైన టీడీపీ అధికారంలో రాకముందు అనేక రకాల హామీలు ఇచ్చిందని, వీటన్నింటికీ పరిష్కరించే విధంగా ఈ ప్రభుత్వం ముందుకు పోవాలన్నారు. సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు పొలంలో వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన భావన టౌన్‌షిప్ అక్రమాలను తొలగిస్తామని కమలాపురం టీడీపీ నాయకులు పుత్తా నరసింహారెడ్డి, హరిప్రసాద్ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చలో భావన టౌన్‌షిప్ కార్యక్రమంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే అక్రమాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు పట్ల సీపీఐ హర్షం

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 15 :ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేయడం పట్ల సీపీఐ హర్షం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఐదు సంవత్సరాల పాలనలో ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియా విచ్చలవిడిగా దోపిడీ చేసిందన్నారు. ఎదిరించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, వారిపైబెదిరింపులు, అడ్డుకున్న వారిని హత్య చేయడానికి కూడా వెనకాడలేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కేసీ బాదుల్లా, నాయకులు లింగన్న, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

'ల్యాండ్ టైట్లింగ్ యాక్టును జగన్ సమర్థించడం దారుణం'

కడప(రూరల్) జూన్ 15 : భయానకమైన ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టును వైఎస్ జగన్ సమర్థించడం దారుణమని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గంగిరెడ్డి శివ శంకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం కడప నగరం ఎర్రముక్కపల్లె సర్కిల్‌లోని టీడీపీ లీగల్‌సెల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అరాచకాలను భరించలేక రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని భూస్థాపితం చేసినా మాజీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం చేసిన తప్పిదాలను సరిదిద్దుకోవడం లేదన్నారు. ప్రజల ఆస్తులకు ఏమాత్రం భద్రతలేని ల్యాండ్ టైటింగ్ యాక్టును నిపుణులు, న్యాయవాదులు, అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా వ్యతిరేఖించినా జగన్ మాత్రం ల్యాండ్ టైటింగ్ యాక్టుతో ప్రజలకు చాలా మంచి జరుగుతుందని చెబుతూ సమావేశాలు పెట్టడం ఆయన అహంబావానికి నిదర్శనమన్నారు.

బక్రీద్ ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ నేతలు

పులివెందుల టౌన్, జూన్ 15: బక్రీద్ పండుగను పురస్కరించుకొని మసీదుల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను టీడీపీ నేతలు శనివారం పరిశీలించారు. పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జోగిరెడ్డి పలువురు టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. పలువురు ముస్లిం మతపెద్దలతో కలిసి మాట్లాడారు. మసీదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని మున్సిపల్, పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డికి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సన్మానిస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

బక్రీదును మతసామర్యంతో జరుపుకోవాలి



డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప (క్రైం), జూన్ 15 : బక్రీదు పండుగను మతసామరస్యంతో జరుపుకోవాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. ఏదైనా సమస్య వస్తే నోడల్ ఆఫీసరుకు లేదా సంబంధిత స్టేషన్ పోలీసుఅధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బక్రీదు పండుగను అన్నిమతాల వారు పరస్పరం సహకరించుకుని సోదరభావంతో పండుగను జరుపుకోవాలన్నారు. సబ్ డి విజను పరిధిలో అన్ని భద్రతా ఏర్పాట్లను చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ముస్లిం సోదరులకు క డప డీఎస్పీ ఎండీ షరీఫ్ బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషిచేయాలి

● మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు తదితరులు

కడప(రూరల్) జూన్ 15 : నేషనల్, స్టేట్ న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూన్ 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కాం అయ్యేవిదంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాధికార సంస్థలో ముందస్తు లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వలన సమయం, డబ్బు ఆదాకావడంతో పాటు వ్యక్తిగత సంబంధాలు చెడవన్నారు. లోక్ అదాలత్‌లో ఒక సారి కేసు పరిష్కారం అయితే సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అపీల్ చేసుకోవడానికి వీలుపడదన్నారు. ఇలాంటి ప్రయోజనాలు కలిగిన లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని వారి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా పక్రుద్దీన్ మాట్లాడుతూ కేసుల పరిష్కార విషయంలో అవగాహన కల్పించెందుకు, కేసు వివరాలను తెలుసుకొనెందుకు గాను ముందస్తు లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతోందన్నారు. సమస్య పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోపి అడ్వకేట్లు పాల్గొన్నారు.

యువతకు చైతన్య స్ఫూర్తి శ్రీశ్రీ రచనలు: డీవైఎఫ్ఐ



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 15 : శ్రీశ్రీ రచనలు యువతకు చైతన్య స్ఫూర్తి అని డీవైఎఫ్ఐ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా శనివారం కడపలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక నిహార స్కిల్ డెవలప్‌మెంటులో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు ఉత్తేజభరితంగా, శ్రామికవర్గానికి దగ్గరగా ఉంటాయన్నారు. ఆయన కవిత్వాలు యువతను కదిలించే విధంగా ఉంటాయన్నారు.

పిల్లల విద్యా, ఆరోగ్య విషయాలపై జాగ్రత్త వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్



భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప(రూరల్) జూన్ 15 : ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంలోని పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాపక్రుద్దీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా జడ్జి తరగతి గదులను, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యా యసేవలు పథకం 2015 గురించి తెలియపరిచారు. పిల్లలు క్రమశిక్షణతో విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు.. ఏవైనా సమస్యలుంటే డిఎల్ఎస్ఏ దృష్టికి తీసుకొనిరావాలన్నారు.

రక్తపరీక్షల కిట్లు సరఫరా



సైపనోత్రిన్, అబేట్ అందిస్తున్న సిద్దయ్య

వేంపల్లె, జూన్ 15: పులివెందుల సబ్‌యూనిట్ పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు రక్తపరీక్షల కిట్లు సరఫరా చేసినట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు తాళ్లపల్లె, వేముల, నల్లపురెడ్డిపల్లె, లింగాల, బిదినంచెర్ల, సింహాద్రిపురం, కోవరంగుట్టపల్లె, తొండూరు, సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మరియు నగరిగుట్ట, బాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లకు ఈ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే దోమల నివారణు సైపనోత్రిన్, లార్వా నివారణకుఅబేట్, బీటీఐ పారాసిటమాల్ మాత్రలు అందించామన్నారు.

గోవధ నిషేధ చట్టం అమలు చేయాలి

వేంపల్లె, జూన్ 15: వేంపల్లెలో గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అ న్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రకు వినతిపత్రం సమర్పించారు. గోవధ పశు సంరక్షణ చట్టం 1977 ప్రకారం ఏ ప్రాంతంలో కూడా గోవులను వధించడం అక్రమం గా తరలించడం వంటి పనులు చేయకూడదనే ఆదేశాలున్నాయని, పట్టణంలో అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మిరెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్రుడు, దొంతు సుమన్, నాగమల్లికార్జున, రాజుల పవన్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలను పరిష్కరించండి



మాధవీరెడ్డిని కలిసిన అర్చకులు

కడప (కల్చరల్), జూన్ 15: అర్చకులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని బ్రాహ్మణ సంఘం, అర్చక పురోహిత సమాఖ్య నాయకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, పీడతల గోపాలకృష్ణశర్మ శనివారం కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డిని ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. ప్రధానంగా వివిధ హిందూ ఆలయాలలో ధూపదీప నైవేద్యాల కింద ప్రస్తుతం అర్చకులకు ప్రభుత్వం రూ.ఐదు వేలు ఇస్తున్నారని, ఆ మొత్తాన్ని పది వేలకు పెంచేలా చూడాలన్నారు.

ఘనంగా గంగమ్మ తిరుణాల

పెండ్లిమర్రి, జూన్ 15: పెండ్లిమర్రి మండలం కారపురెడ్డిపల్లెలో శనివారం కొత్తగంగమ్మ దేవత తిరుణాల ఘనంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం, బండలాగుడు పోటీలు, భక్తులకుఅన్నదానం ఏర్పాటుచేశారు. అన్నదానానికి పులివెందులకు చెందిన పాపిరెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి రెండు లక్షల రూపాయలు విరాళం అందజేశారు.

జీఓ 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ వినతి



ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 15 : ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీఓ 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చే శారు. శనివారం కడప ఎమ్మెల్యే మాధవీ నివాసంలో మాధవీరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీఓ నెం.117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను యధావిధిగా కొనసాగిస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను పాత పద్ధతిలో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలలు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ప్లస్ 2 కూడా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోను, ఉన్నత విద్య తెలుగు, ఆంగ్ల మాధ్యమంలోను కొనసాగించాలన్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను గుర్తించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు కొసాగేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జీఓ117ను వెంటనే రద్దు చేసి వీలైనంత త్వరగా నియామకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, పర్వీన్, ప్రభాకర్, చంద్రశేఖర్, గోపినాథ్,సమీర్‌బాషా, కరీముల్లా పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని దుశ్శాలువాలతో సన్మానించి అభినందనలు తెలుపుతున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి.

సమస్య పరిష్కారం అయ్యేనా..?

● బురదమయంగా హచ్‌టవర్ ప్రధాన వీధి

ఎర్రగుంట్ల, జూన్ 15: ఎర్రగుంట్లనగరపంచాయతీ హచ్‌టవర్ వీధిలో పరిస్థితి దారుణంగా వుంది. చిన్నపాటి వర్షానికే అక్కడ రోడ్డంతా బురదమయంగా మారింది. నడిచివెళ్లే ప్రజలకే కాక వాహనాల్లో వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో వర్షపు నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ లేదు. గతంలో పూర్తిస్థాయిలో టెండర్లు పిలిచి నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో హచ్‌టవర్ రోడ్డు వర్షం వస్తే చాలు మోకాటిలోతు గుంతలు, బురదమయంగా మారి తీవ్ర దుర్గం వెదజల్లుతోంది. ఇదే దారిలో ఎంపీపీ మెయిన్ స్కూల్ వుంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు నరకప్రాయంగా వుంది. తల్లిదండ్రులు వచ్చి వదిలి వెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారింది. రోడ్డుపై వెళ్లాలంటేనే ఎక్కడ జారిపడతామోనన్న భయం వెంటాడుతోంది. ఇప్పటికే బైక్‌ల్లో, నడిచివెళ్లే వారు కిందపడ్డారు.

● **వీధుల్లో వర్షపు నీరు..:** హచ్ టవర్ ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా వీధుల్లోని నీరు బయటికి వెళ్లేందుకు వీల్లేకుండా వుంది. ప్రధానరోడ్డులోని డ్రైనేజీ పూర్తయితే తప్ప ఆ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితిలేదు. వెంటనే డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. నీరు నిలిస్తే చాలు ఫిర్యాదు చేయడంతో సీసీరోడ్డుపై ఉన్న నీటిని ట్యాంకర్‌లోకి పంపింగ్ చేసి బయటికి పంపుతున్నారు. ఇలా ఎన్ని సంవత్సరాలు చేస్తారో, ఎంత ప్రజా ధనం దుర్వినియోగం చేస్తారో అధికారులకే తెలియాలని ప్రజలు విమర్శిస్తున్నారు. అయితే ప్రధాన రోడ్డుకు అనుసందానంగా ఉండే వీధుల్లో డ్రైనేజీ వేసేందుకు అక్కడి ప్రజలు సహకరించడంలేదని, అయితే వర్షపు నీరు నిలిస్తే మాత్రం ఫిర్యాదులు చేస్తున్నారని అధికారులు తమ వాదనను వినిపిస్తున్నారు. కాలువలు వేసేందుకు ఇళ్లముందు ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు వారు ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు.



బురదమయమైన ఎర్రగుంట్ల హచ్ టవర్ వీధి



స్టాల్స్‌కు టెండర్లు ఆహ్వానం

జమ్మలమడుగు, జూన్ 15: జమ్మలమడుగు ఆర్టీసీ బస్‌స్టేషన్, మైలవరంలోని బస్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న స్టాల్స్ స్థలాల్లో వ్యాపారాలు నిర్వహించుటకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. జమ్మలమడుగు కార్యాలయంలో 14 నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తులు విక్రయిస్తామన్నారు. పూర్తి చేసిన టెండరు ఫారాలు 28వ తేదీ 12 గంటలలోపు డిస్టిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయాలన్నారు. అదే రోజు సాయంత్రం టెండరుదారుల సమక్షంలో టెండరులో ఫారాలు చూస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధునిక సాహిత్యానికి మార్గదర్శి శ్రీశ్రీ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15: అభ్యుదయ భావంతో కవిత్వాన్ని రచించిన శ్రీశ్రీ ఆధునిక సాహిత్యానికి మార్గదర్శకంగా నిలిచారని జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

బెంచీలు వితరణ

ఎర్రగుంట్ల, జూన్ 15: ఎర్రగుంట్ల క్రీడా మైదానంలో పాఠశాల పూర్వ విద్యార్థులు సుమారు రూ.50వేల విలువ చేసే బెంచీలను వితరణ చేశారు. ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో పది పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అంకిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మాబు, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తమ బ్యాచ్‌కు గుర్తుగా 13 బెంచీలను క్రీడా మైదానంలో ఏర్పాటు చేశారు.

కెమికల్స్‌తో పర్యావరణానికి ముప్పు

ఎర్రగుంట్ల, జూన్ 15: ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో అనుమతులు లేకుండా వినాయక విగ్రహాలు తయారు చేస్తుండటంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని టీడీపీ, బీజేపికి చెందిన నాయకులు షరీఫ్, అంకిరెడ్డి, రమేష్‌రెడ్డి, ఇమాంసాహెబ్, ప్రభుదానం, మరికొందరు శనివారం కమిషనర్ రామక్రిష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహాలు తయారుచేస్తున్నారని దీనికి కెమికల్స్ వినియోగం కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. అనుమతులు లేకుండా వాణిజ్య సముదాయాన్ని కడుతున్నాడని వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ధర్మవరం-మచిలీపట్నం రైలు స్టాపింగ్ ను కొనసాగించాలి

కొండాపురం, జూన్ 15: ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలుకు కొండాపురంలో స్టాపింగ్ కొనసాగించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు.ఈ మేరకు శనివారం వారు కొండాపురం స్టేషన్‌మాస్టర్ కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కొండాపురంలో ఈ నెల 18 వరకు ఈ రైలుకు స్టాపింగ్ ఇచ్చారని దానిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు,జయంతు,డాక్టర్ ప్రభాకర్‌రావు,చిన్నా, ఖాదర్‌బాష, గణేష్‌సాయి,బాబు, షేక్షావలి,శివ పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు

జమ్మలమడుగు, జూన్ 15: జమ్మలమడుగు దిగువపట్నం కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ దళిత నాయకులు బిర్రు సంతోష్‌తో పాటు మరికొందరు శనివారం టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు వారు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రబాబు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ జిల్లాలో టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని కలిసి మాట్లాడినట్లు వారు అన్నారు.



శ్రీనివాసరెడ్డికి కలిసిన నాయకులు

వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 15: అమ్మానాన్న వృద్ధాశ్రమానికి చెందిన ఒంటేరు నారాయణ (83) అనే వృద్ధుడి మృతదేహానికి మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆ వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయనకు కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకులు, మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ నిర్వాహకులను సంప్రదించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు శనివారం హిందూ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భార్గవ్‌సాయి, సుబహాన్, మునీంద్ర, సుమన్‌బాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, కుర్చీలు అందజేత



కుర్చీలు, దుప్పట్లు, వస్తువులు అందిస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూన్ 15: జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఆస్పత్రి అభివృద్ధికి దేవగుడి శంకర్ రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్టు అందుబాటులో ఉంటుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రస్టు ఆధ్వర్యంలో ఆస్పత్రికి కుర్చీలు, దుప్పట్లు తదితర వస్తువులను ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు టీడీపీ మండలాధ్యక్షుడు శింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, పొన్నతోట శ్రీను, మల్లికార్జున పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు



108కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

ఎర్రగుంట్ల, జూన్ 15: టీడీపీ కూటమితో కూడిన పార్టీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు సీఎం కావాలని, సీఎం.రమేష్ ఎంపీగా గెలవాలని మొక్కుకున్న పోట్లదుర్తి టీడీపీ నాయకులు తమ మొక్కులను శనివారం తీర్చుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర యూత్‌నాయకుడు సారథినాయుడు ఆధ్వర్యంలో పోట్లదుర్తి నడిగడ్డ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కును తీర్చుకున్నారు. అలాగే అనకాపల్లి ఎంపీగా సీఎం.రమేష్ గెలుపొంది నందుకు ఆనందం వ్యక్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోట్లదుర్తి ఉప సర్పంచి రాము నాయుడు, సీఎం.చరణ్, జయప్రకాష్‌నాయుడు, సుదర్శన్‌నాయుడు, మధుసూదన్‌నాయుడు, హరి, రామక్రిష్ణనాయుడు, టీడీపీ కార్యకర్తలుపాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

బద్వేలుటౌన్, జూన్ 15 : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మున్సిపాలిటీలో నెలకొన్న నీటి సమస్యలను నివారించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే సుధా, చైర్మన్ రాజగోపాల్‌రెడ్డికి సూచించారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు.

రజాసాహెబ్‌పేట మాజీ సర్పంచ్ కన్నుమూత

పోరుమామిళ్ల, జూన్ 15: మండలంలోని రజాసాహెబ్‌పేట మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి (68) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ శనివారం రజాసాహెబ్‌పేట గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి తమ ప్రగాఢ సంతాపం తెలిపింది. ఆమెతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.



నివాళి అర్పిస్తున్న విజయమ్మ

కోవర్టులుగా పనిచేసిన వారు

ఆత్మపరిశీలన చేసుకోవాలి

టీడీపీ నాయకులు

పోరుమామిళ్ల/బద్వేలు రూరల్, జూన్ 15 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో ఉంటూ కోవర్టులుగా ఉండి వైసీపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని వారికి అనుకూలంగా వ్యవహరించి నేడు కూటమి అధికారంలోకి రావడంతో మరలా మాట మార్చి నాయకుల మెప్పుగోలు కోసం ప్రకటన చేసేవారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని టీడీపీ పార్లమెంటు మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి హబీబున్నీసా, టీడీపీ నేతలు సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, తెలుగుయువత అధ్యక్షుడు బాలాజీ, మస్తాన్ తదితరులు పేర్కొన్నారు. శనివారం వారు పోరుమామిళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమిలో కొందరు తమ స్వార్థంతో ఇతర ప్రయోజనాలు పొందేందు కు వైసీపీతో కుమ్మక్కయ్యారన్నారు. అలాంటి వారు నేడు నేతలను కలిసినట్లు అభినందనలు తెలిపినట్లు సోషల్ మీడి యాలో పోస్టులుపెట్టుకోవడం చూస్తే విడ్డూరంగా ఉందన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు పోస్టులు పెట్టిన వారు ఈ రోజు ఆ పార్టీలో మేమున్నామంటూ చెప్పుకోవడం చాలా సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమం లో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పాలకొండు సుధారాణి, నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి టీడీపీ నాయకులు మస్తాన్, రంతుల్లా, షరీఫ్, ప్రొఫెసరు బాషా, అన్వర్, కరీముల్లా,దర్వేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల.. సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

అట్లూరు సొసైటీ అధ్యక్షుడి రాజీనామా

అట్లూరు, జూన్ 15 : అట్లూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి రాజీనామాపత్రాన్ని డివిజన్ కోఆపరేటివ్ సొసైటీ అధికారికి శనివారం అందించినట్లు ఆయన తెలిపారు. తన వ్యక్తిగత కారణాల వల్ల అధ్యక్ష పదవికి రాజీనామా చేశానన్నారు. తదుపరి పరపతి సంఘం అధ్యక్షుని ఎన్నిక నిర్వహించాలని కమిటి తీర్మానం చేసి పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు.

పుట్టా గెలుపుతో తిరుమలకు పాదయాత్ర



తిరుమల పాదయాత్రకు వెళుతున్న టీడీపీ నాయకులు

మైదుకూరు రూరల్, జూన్ 15 : మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్,ఆయన కుమారుడు పుట్టా మహేష్ యాదవ్ ఏలూరు ఎంపీగా గెలుపొందడంతో పార్టీ మండలాధ్యక్షుడు బీమయ్య, యువ నాయకుడు కిషోర్ తిరుమలకు పాదయాత్రను శనివారం జీవీసత్రం నుంచి ప్రారంభించారు. ఈ పాదయాత్రకు రామచంద్ర నాయుడు పసుపు జెండాను ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి వందలాది మంది పుట్టా అభిమానులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: పుట్టా సుధాకర్‌యాదవ్ శాసనసభ్యులుగా ఎన్నికైతే కాలినడకన తిరుమలకు వస్తానని మొక్కుకున్న మైదుకూరు మండలాధ్యక్షుడు బీమయ్య, కిశోర్‌ల ఆధ్వర్యంలో ఎర్రబల్లె పంచాయతీ ప్రజలు దాదాపు 200 మంది శనివారం పాదయాత్ర చేపట్టారు. శనివారం మధ్యాహ్నాం ఖాజీపేట మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి, నాయకులు జానకీరాం, నంద్యాల సుబ్బయ్య, రామానాయుడు, రామసుబ్బయ్య, జైలు సుబ్బరాయుడు, టీ అంగడి హబీబ్, నాగసానిపల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మకు బోనాలు

అట్లూరు, జూన్ 15 : మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో వెలసిన అంకాలమ్మకు ఆదివారం గ్రామస్తులంతా పోతులరాజు, పోలేరమ్మకు బోనాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. సోమవారం పోలేరమ్మ పోతురాజు ఊరేగింపు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కేసులు నమోదు

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ

జమ్మలమడుగు, జూన్ 15: జమ్మలమడుగులో శనివారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా సందర్శించారు. శంకర్ నర్సింగ్ హోంను సందర్శించి స్కానింగ్, అక్కడున్న రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగనిర్ధారణ నిషేధ చట్టంలో భాగంగా సూచనలు ఇచ్చారు. లింగ నిర్ధారణ చేస్తే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామన్నారు. రూ.50 వేలు అపరాధ రుసుం విధించడమేకాక రెండో సారి అదే తప్పు జరిగితే సంబంధిత డాక్టర్ సర్టిఫికెట్ రద్దు చేస్తూ జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. జమ్మలమడుగులో ఎక్కడైనా లింగనిర్ధారణ చేసినట్లు, చేస్తున్నా తమకు సమాచారం ఇస్తే వెంటనే తనిఖీ చేస్తామని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న శాంతికళ

లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

ముద్దనూరు జూన్15:లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి పేర్కొన్నారు. మండల పరిధి కొత్తపల్లె గ్రామంలో శనివారం మండల లీగల్ సెల్ అథారిటీ సర్వీసెస్ కమిటీ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 29 జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకొని కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎంపీడీవో చంద్రమౌళి,న్యాయవాదులు మునిసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి ,సుబ్బారావు పాల్గొన్నారు.

దోమతెరలను వినియోగించాలి

కాశినాయన, జూన్ 15: ప్రభుత్వ వసతిగృహాలలో దోమల నివారణకు శనివారం మందును స్ప్రే చేయించినట్లు మండల ఆరోగ్య పర్యవేక్షకుడు బాలయ్య తెలిపారు. ఇందులో భాగంగా నర్సాపురంలోని ఎస్సీ బాలుర,బీసీ బాలికల వసతిగృహాలతోపాటు, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని బాలికల వసతిగృహంలో కూడా స్ప్రేచేయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం బీబీ, ఆశాకార్యకర్తలు ఓబులమ్మ ,మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఖాజీపేట, జూన్ 15: ఖాజీపేటలోని కోటంగురాయునిపల్లె గ్రామంలో నిర్మించిన లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి 7వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, తోమాల సేవ, మంగళహారతి ఇచ్చిన అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. 10 గంటల నుంచి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకోసం ఆప్కో మాజీ చైర్మన్ గుజ్జల శ్రీను ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ గ్యారేజీ ఆవరణం

● ఉరుస్తున్న పార్శిల్ కొరియర్ కార్యాలయం ● ఇబ్బందుల్లో సిబ్బంది



ఆర్టీసీ గ్యారేజీలో భారీగా నిలిచిన వర్షపునీరు

జమ్మలమడుగు, జూన్ 15: ఇటీవల కురిసిన వర్షానికి ఆర్టీసీ గ్యారేజీ ఆవరణం చెరువును తలపిస్తోంది. కొద్దిపాటి వర్షం వచ్చినా నీళ్ల ఆగి ప్రయాణికులు, సిబ్బందికి అసౌకర్యాన్ని కలిగిస్తోంది. అలాగే ఒకప్పుడు జిల్లాలోనే జమ్మలమడుగు ఆర్టీసీ డిపో మంచి పేరుగాంచింది. అయితే అయిదు సంవత్సరాల నుంచి ఆర్టీసీ ప్రాంగణంలో సమస్యలు ఉన్నాయి. గ్యారేజీ ఆవరణలో కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు ఆగుతున్నాయి. రెండు రోజుల నుంచి భారీ వర్షంతో చెరువులాగా మారింది. అలాగే పార్శిల్ కొరియర్ కార్యాలయంలో వర్షానికి ఉరుస్తుందని అక్కడ సిబ్బంది కూర్చోవాలన్నా ఇబ్బందికరంగా మారింది. ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణం రేకుల వరండా దెబ్బతిని నెర్రలుబారడంతో వర్షపునీరు పార్శిల్ కార్యాలయం వద్ద పడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి రేకుల వరండాపై దెబ్బతిన్న ప్రాంతంలో కొత్తగా రేకులు అమర్చాలని కోరుతున్నారు.

బదిలీపై వెళుతున్న బ్యాంకు మేనేజరుకు సన్మానం

బి.కోడూరు, జూన్ 15 : మండలంలోని బి.కోడూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మేనేజరుగా పనిచేస్తున్న అశోక్‌కుమార్ బదిలీపై ఒంగోలు రీజనల్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. ఆయన బ్యాంకు నుంచి శనివారం రిలీవ్ అయినందున బ్యాంకు సిబ్బంది ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.